www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 13 ఫిబ్రవరి 2025
5
చిత్తూరు



నేడు కుప్పంలో

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 13వ తేదీ గురువారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని, నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యకమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచితమని ఊడ్చేస్తున్నారు..

- కన్నెర్ర జేసిన గ్రామస్తులు
- రోడెక్కి.. రాస్తారోకో..
- ఇసుకాసురుల ఆగడాలు
- తట్టుకోలేకపోతున్నాం
- ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఆ పార్టీలోని ఇసుకాసురులు బరితెగించారు. ఉచిత ఇసుక పథకం వారికి వరంగా మారింది. ఉచితం అనడంతో ఇసుకను వ్యాపార వస్తువుగా మార్చేశారు. నగరి కుశస్థలి నది నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా రవాణా చేస్తూ ఉచితం పేరుతో ఇసుకను ఊడ్చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉచిత ఇసుక ముసుగులో పాతేశారు. ఇసుకాసురుల ఆగడాలతో నది గట్టుకు కాలకృత్యాలకు వెళ్లే మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. దీంతో గ్రామస్తులు కన్నెర్ర చేశారు. రోడ్డెక్కి రాస్తారోకో చేస్తూ సమస్య పరిష్కారం అయ్యేదాకా లేవమంటూ భీష్మించుకు కూర్చున్నారు..


రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు, మహిళలు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక దోపిడీకి లైసెన్స్ ఇచ్చినట్లు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు పార్టీ నేతలు. ఇసుక ఉచితం పేరుతో కుశస్థలి నదిని కుళ్లబొడిచేస్తున్నారు. సత్రవాడ ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను దోచేస్తుండటం, ఉదయాన్నే కుశస్థలి నది గట్టుపైకి కాలకృత్యాలకు వెళ్లే మహిళల పట్ల ఇసుక తరలింపుదారులు అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో సత్రవాడ, వినాయకపురం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహంతో రోడ్డెక్కారు. ఇసుక తరలింపుదారుల ఆగడాలు తట్టుకోలేకపోతున్నాం అంటూ రోడ్డుపై కూర్చున్నారు. ఇసుక తరలింపుకు అడ్డుకట్ట వేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వేలాపాలా లేకుండా రాత్రింబవళ్లు ఇసుక తరలింపు జరుగుతోందన్నారు. ప్రభుత్వం అవసరాలకు ఇసుక ఉచితం అంటే దాన్ని వ్యాపారంగా మార్చేసి తరలించేస్తున్నారని, వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కేసారని అన్నారు. నదిలో ఇసుక తీయాల్సిన పరిమితిని మించి తోడేస్తున్నారని, నీరున్నా వదలడం లేదని అందులో నుంచి కూడా ఇసుకను తీసి తరలిస్తున్నారని తెలిపారు. నది నుంచి వారు ఇసుక తరలించే మార్గం ఇసుక పేరుకుపోయి అధ్వానంగా తయారైందన్నారు. ఆ దారిలో వాహనాల్లో వెళ్లేవారు అదుపు తప్పి పడిపోతున్నారని, మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు వెళుతోందని పిల్లల్ని బయటకు పంపడానికి భయమేసే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు వేకువజామున కాలకృత్యాలకు నదిగట్టుకు వెళితే ఇసుక తరలింపుదారులు సెల్‌ఫోన్ల ద్వారా ఫోటోలు, వీడియోలు తీస్తున్నారని మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యలకు ముగింపు పలికేదాకా ధర్నా విరమించమంటూ భీష్మించుకు కూర్చున్నారు. ఇంతగా ధర్నా చేస్తున్నా ఉన్నతాధికారులు ఆర్డీవో, డీఎస్పీ ఎందుకు ఇక్కడకు వచ్చి తమ సమస్యలను అడిగి తెలుసుకోలేదంటూ నినాదాలు చేశారు.

డబ్బు వసూలు చేస్తే కఠిన చర్యలు


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని నెట్వర్క్ ఆస్పత్రులలో డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ కింద వచ్చే పేషంట్ల నుంచి డబ్బులు వసూలు చేసినా ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు కింద సేవలందించే నెట్వర్క్ ఆసుపత్రులలో ఫిర్యాదులు అందిన ఆసుపత్రులపై జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నెట్వర్క్ ఆసుపత్రుల ద్వారా డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద పేద ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఈ సేవలు పొందేందుకు నెట్వర్క్ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్ల నుండి డబ్బులు వసూలు చేసిన వారిని ఇబ్బంది పెట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నెట్వర్క్ ఆసుపత్రుల వారు పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్య మిత్రులు వీరికి అవసరమైన సలహాలు వైద్యసేవలు అందించడంలో పూర్తి సహాయ సహకారాలు అందించేలా ఆ దిశగా ఆరోగ్య మిత్రులు పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ సుదర్శన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా నెట్వర్క్ ఆసుపత్రులకు సంబంధించి 31 ఫిర్యాదుల అందగా సంబంధిత ఆసుపత్రుల ప్రతినిధులతో ఫిర్యాదులకు సంబంధించిన పేషెంట్ల బిల్లులకు సంబంధించిన డాక్యుమెంట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత నెట్వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

శ్రీ వివేకానంద విజయపరంపర


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక మురుగాన్‌పల్లిలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫస్ట్‌పేస్ ఫలితాల్లో విజయ దుందుభి మోగించారని కళాశాల కరస్పాండెంట్లు భాస్కర్ నాయుడు, మహేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తరుణ్ కుమార్ 96.1, బాలు 95.9, లక్ష్య 95.8, హేమేశ్వర్ 91.7, సంతోష్ 95.4, రాకేష్ 92.1, సందీప్ 91.4, కావ్య 90.5, భార్గవ్ 89.2, సనీర 89.2, భావన 88.9, రుత్విక్ రాజ్ 88.7, దిశా హరిణి 87.9, మాన్య 87.2, సాత్విక్ 87.1 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్లు అభినందనలు తెలియజేశారు.

టౌన్ ఫస్ట్ శ్రీ పిఎస్ఎన్ వివేకానంద



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సత్యనారాయణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పిఎస్ఎన్ శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి యోహిత్ 96.03 మార్కులు సాధించి చిత్తూరు నగర టాపర్‌గా నిలిచారు. తమ కళాశాల విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో చిత్తూరు నగర టాపర్‌గా నిలవడం తమ కళాశాల విద్యా బోధన, అధ్యాపకుల అంకిత భావం, విద్యార్థుల క్రమశిక్షణకు నిదర్శనమని కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజు శెట్టి తెలిపారు. అలాగే అనిష్ 95.8, స్నేహ 95.7, పవన్ కళ్యాణ్ 94.2, సాహితీ 93.1, గణేష్ 92.7, తేజ రెడ్డి 92.5, దిలీప్ కుమార్ 92.1, వినీత 91.9, మాన్యతా రెడ్డి 91.2, జిష్ణు 90. 8, మహిత కీర్తి, 90.6 లిఖిత, 89.7 రెడ్డి చరిత 89.4, హాసిని, 89.3 మార్కులు సాధించారని తెలిపారు.

సత్తా చాటిన విజయం విద్యార్థులు




మంగళవారం విడుదల చేసిన జాతీయ స్థాయి పోటీ జేఈఈ మెయిన్స్ ఫలితాలలో స్థానిక విజయం జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని కళాశాల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి తెలిపారు. జె.గగన సాయి 92, కె. పవన్ సాయి 85 పర్సంటేజ్ సాధించగా మరో 10 మంది విద్యార్థులు 80కి పైగా పర్సంటేజ్ సాధించారని తెలిపారు. ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందిస్తూ రాబోవు పోటీ పరీక్షలనందు మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని ఆశించారు.

జేఈఈ మెయిన్స్‌లో

93.48 మార్కులు సాధించిన మండల విద్యార్థి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండంలోని కచ్చేటివారిపల్లి గ్రామానికి చెందిన శాంతి, మార్కొండయ్యల కుమారుడు ప్రేమ్ తేజ్ జేఈఈ మెయిన్స్‌లో 93.48 పర్సంటేజ్ సాధించినట్లు ప్రేమ్‌తేజ తండ్రి మార్కొండయ్య తెలిపారు. ప్రేమ తేజ్ 10వ తరగతి వరకు మండల కేంద్రంలోని ఎస్టీ మేరీ పాఠశాలలో విద్యనభ్యసించి ఇంటర్మీడియట్ విజయవాడ చైతన్య కళాశాలలో చదివారు. జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో93.48 శాతం సాధించినట్లు తెలిపారు.

అధికారుల ఆకస్మిక తనిఖీలు


గుడిపల్లిలో..

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని ఆగరం గ్రామపంచాయతీ ఏ కొత్తపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆర్‌డిఓ శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, కోడి గుడ్లు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పోషక ఆహారాన్ని తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

తవణంపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలో జిల్లా స్పోర్ట్ అథారిటీ స్పెషల్ ఆఫీసర్ బాలాజీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండలంలోని అరగొండ హైస్కూల్, దిగువమాగం, అరగొండ, టి పుత్తూరులోని అంగన్వాడీ కేంద్రాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో అన్ని వసతులు అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపిడిఓ రెడ్డిబాబు, ఐసిడిఎస్ పీడీ నిర్మల, సూపర్వైజర్ లావాణ్య పాల్గొన్నారు.

ఐరాల: జిల్లా ప్రజా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి రవికుమార్ ఐరాల ఎంపీడీఓ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన పరికరాలను పరిశీలించారు. వెంటనే అవసరమైన రిపేర్లు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రికార్డులను జాగ్రత్తగా కాపాడాలని, మరమ్మతుల కొరకు అవసరమైన నిధులను విడుదల చేస్తామని తెలియజేశారు.


ఐరాలలో ఎంపిడిఓ


బంగారుపాళ్యంలో..

రికార్డులు తనిఖీ చేసిన ఎంపీడీవో

మండంలోని గుండ్లపల్లి, వేదగిరివారిపల్లి సచివాలయాలను బుధవారం ఎంపిడిఓ ధనలక్ష్మీ తనీఖి చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అలాగే మిస్సింగ్ సిటిజన్ ఎంఎస్ఎంఈ సర్వేల గురించి సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. అలాగే ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను తనిఖీ చేసి క్లాప్ మిత్రలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె వెంట ఎంపీటీసీ లోకేశ్వర రెడ్డి, సర్పంచ్ రాజేంద్ర, పంచాయతీ సెక్రటరీలు బేబీ, కృప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పూజ, డిజిటల్ అసిస్టెంట్లు హేమ, క్రాంతి, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రియదర్శిని, లక్ష్మీపతి, మహిళా పోలీసులు కుమారి, లావణ్య పాల్గొన్నారు.

సోమల: సోమల మండలంలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, పలు అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ ఏపీ డిఆర్‌డిఎ అధికారి మల్లికార్జున బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సోమల నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం అవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలల్లో జరుగుతున్న నాడు -నేడు పనులను ఇంకా ఎందుకు పూర్తి చేయలేదని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం మెనూప్రకారం విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. సూరయ్యగారిపల్లి మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులు తరగతి గదులలో కూర్చునేందుకు డెస్కులు చాలడం లేదని సిబ్బంది తెలియజేయడంతో నమోదు చేసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన పరిసరాల పరిశుభ్రత పాటించాలని మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా రుచికరంగా చిన్నారులకు వండి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించి వారిని రోజు స్నానం చేసుకొని మంచి బట్టలు ధరించి వచ్చేలా నేర్పించాలని అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించి అన్ని గదులను తనిఖీ చేసి సలహాలు సూచనలు అందజేశారు. చివరిగా మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేసి కూలీల సంఖ్య పెంచాలని రానున్న వేసవి దృష్ట్యా ఉపాధి పనులకు వచ్చే కూలీలకు క్షేత్రస్థాయిలో అవసరమైన మంచినీటి సదుపాయం, నీడ ప్రాథమిక చికిత్స కోసం మందులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఏపీవో దినకర్ బాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


సోమలలో..


తవణంపల్లిలో..

బంగారుపాళ్యం: ఏఆర్‌టి కేంద్రాన్ని బుధవారం డిఎండిఓ శంకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. డాక్టర్ శిరీష, ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు, లాబ్ టెక్నీషియన్ జయ చంద్ర, భవాని, సద్దాని పాల్గొన్నారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో దుకాణాలు, హోటళ్లు, వర్క్ షాపులు, మెకానిక్ షెడ్లు తదితర షాపులను బుధవారం పీలేరు సహాయ కార్మికశాఖ అధికారి ఆనందబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చదువుకోవాల్సిన పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు.


రొంపిచెర్లలో..

చిత్తూరులో వేగంగా రోడ్ల అభివృద్ధి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో రోడ్ల అభివృద్ధి వేగం పుంజుకుంది. గడిచిన ఐదేళ్ల కనీసం మరమ్మతులకు నోచుకోక గుంతలమయమై ప్రజలకు నరకయాత్ర చూపించిన నగర రోడ్లు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చొరవతో అభివృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే నగరంలో చాలా వరకు రోడ్లపై గుంతల పూడ్చి ప్రయాణానికి అనువుగా మార్చగా.. కొత్తగా రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. నగరంలో అత్యంత కీలకమైన ఫారెస్ట్ రోడ్డు అభివృద్ధి పనులు ఎమ్మెల్యే గురజాల కృషితో ప్రారంభమైంది. ఇరుకైన, గుంతలమయమైన ఫారెస్ట్ రోడ్డు విస్తరణ, అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రమాదాలు చోటు చేసుకోవడం, ప్రజల ప్రాణాలు పోతుండడంతో.. ఎమ్మెల్యే ఫారెస్ట్ రోడ్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పరిస్థితిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు విస్తరణ, అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను వివరించి నిధులు మంజూరు చేయించారు. నగరపాలక సంస్థ, ఆర్ అండ్ బి శాఖల సమన్వయంతో రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వేలూరు రోడ్డు పీవీకేఎన్ కళాశాల నుండి మ్యాంగో భవన్ వరకు సుమారు కోటి రూపాయలతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి చేసే పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో ఉన్న మరింతగా విస్తరించి తారు రోడ్డు వేస్తున్నారు. మిగిలిన రోడ్డును ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నారు. నగరంలో రోడ్ల పరిస్థితి చాలా వరకు మెరుగైందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లోకాయుక్త ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ



ప్రజాశక్తి- వీకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు భూములు పోగొట్టుకున్న బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై పలమనేరు ఆర్‌డిఓ భవాని బుధవారం విచారణ నిర్వహించారు. వీకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రెవెన్యూ అధికారులతో చేరుకున్న ఆర్డీవో బాధితులను విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 20 ఏళ్ల క్రితం ఎక్సాల్ పట్టా ఇచ్చిన భూములను జూనియర్ కళాశాల కోసం తీసుకున్నారని, అయితే తిరిగి బాధితులకు ఎలాంటి భూమి గానీ ఇంటి స్థలాలు గాని ఇవ్వకపోవడంతో తాము లోకాయుక్తను ఆశ్రయించాల్సి వచిందని బాధితులు వివరించారు. భూమిలేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సమీపంలోని మరోస్థలాన్ని చూపిన గత పాలకులు వాటిని వారి అనుచరులకు కేటాయించి తమకు అన్యాయం చేశారని ఆమె ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వారి వద్ద ఉన్న పూర్తి ఆధారాలను ఆర్డిఓకు సమర్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. విచారణలో తహశీల్దార్ పార్వతి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

రజకుల భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి
బాధితులకు న్యాయం చేయాలి
సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి - సదుం: సదుం మండలం కంభంవారిపల్లి రెవెన్యూ గ్రామం పరిధిలోని రజకుల వంకమద్ది చెంగన్నకు చెందిన భూమిని అగ్రకులస్థుల శివరామి రెడ్డి, ధనశేఖర్‌రెడ్డి, మహేష్ అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ భూములను బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ 314/3, 314/7, 345/7, 369/11, 296/5, 508/1 సర్వే నంబర్లు వి.చెంగన్న భూమి ఆన్లైన్లో పాసుబుక్కులు అన్నీ ఉన్నప్పటికీ దౌర్జన్యంగా అగ్రకులస్తుడైన శివరామిరెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించి మామిడి చెట్లు పెట్టారని, మామిడి చెట్లు పెట్టినప్పటి నుంచి అడుగుతున్నప్పటికీ దౌర్జన్యం చేస్తూ కొట్టడం జరిగిందని తెలిపారు. ఇంత దౌర్జన్యం జరుగుతున్న రెవెన్యూ అధికారులు కానీ పోలీసు అధికారులు కానీ పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. కేసు పెట్టినా పోలీసులు కేసు పెట్టలేదని, ఈ పరిశీలనకు వెళ్లిన సందర్భంగా సదుం మండలంలోని అనేకమంది బాధితులు సిపిఎం బృందంకి తెలియజేస్తూ మండలంలో మా భూముల కూడా ఆక్రమించారని లబోదిబో అంటున్నారని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు సదుం మండలంలో పేదల భూములపై సర్వే చేసి సమగ్రంగా విచారణ చేపట్టి నిజమైన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సర్వేలు చేసి హద్దులు చూపించమని చెప్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే పేదల భూములు సర్వేచేసి వాళ్ళ హద్దులు చూపించాలని కోరారు. అలాగే భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని లేకుంటే బాధితులందరినీ ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ నాయుడు, బాధితులు లక్ష్మీదేవి, క్రిష్ణయ్య, రత్నయ్య పాల్గొన్నారు.


ఆక్రమణకు గురైన భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సంక్షేమ హాస్టల్ భవనాల
మరమ్మతుకు రూ.1.56 కోట్లు విడుదల

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు 8 ప్రభుత్వ హాస్టల్ భవనాలను రిపేర్లు చేయించి విద్యార్థులకు సౌకర్యం కల్పించడానికి గాను రూ.1.56కోట్లుతో పనులు చేయడానికి నిధులు మంజూరైందని ఎఎస్ డబ్ల్యూఓ షకీలా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని హాస్టల్ భవనాలు చాలాచోట్ల మరమ్మతులకు గురైందని తెలుసుకొని, ఆ భవనాలను రిపేర్ చేయడానికి నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించారని పేర్కొన్నారు. హాస్టల్లో చదివే పేద విద్యార్థుల సమస్యలను గుర్తించారని, కలెక్టర్ సహకారం వల్ల ప్రభుత్వం ద్వారా ఎనిమిది హాస్టల్ బవనాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.56 కోట్లుతో పనులు చేయడానికి మంజూరు ఉత్తర్వులు వచ్చాయన్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని బాలుర హాస్టల్ భవనానికి రూ.22 లక్షలు, బాలికల హాస్టల్ భవనానికి రూ.21 లక్షలు, తూగుండ్రం హాస్టల్ భవనానికి రూ.20.50 లక్షలు, ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లిమిట్ట హాస్టల్ భవనానికి రూ.33 లక్షలు, పెనుమూరు హాస్టల్ భవనానికి రూ.10 లక్షలు, ఉగ్రాణంపల్లి హాస్టల్ భవనానికి రూ.17.50 లక్షలు, పూతలపట్టు హాస్టల్ భవనానికి రూ.16 లక్షలు, పి కొత్తకోట హాస్టల్ భవనానికి రూ.16 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే హాస్టల్ భవనాలు పనులు ప్రారంభమవుతుందన్నారు.

రేపు జాబ్ మేళా

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్, రాష్ట్ర సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ సహకారంతో ఈనెల 14వ తేదీన చిత్తూరు ఎంప్లాయిమెంట్ ఆఫీస్ వద్ద ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపిఎం ఫరీద్ మస్తాన్, జాబ్ మేళా నిర్వాహకులు రూపేష్, లోకేష్, కృష్ణయ్యలు తెలిపారు. కొటక్ కంపెనీ గ్రూప్ ద్వారా బిఎస్ఎస్ మైక్రో ఫైనాన్స్ 50 ఉద్యోగాలు, మెడ్ ప్లస్ మెడికల్ స్టోర్స్‌లో 53 ఉద్యోగాలు, కెవిఆర్ జువెలర్స్ 10 ఉద్యోగాలు భర్తీ చేయడానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఉద్యోగాలకు హాజరయ్యే అభ్యర్థులకు 18 నుంచి 35 లోపు వయసు ఉండాలన్నారు మిగిలిన వివరాలకు వెలుగు ఆఫీస్‌లో సంప్రదించాలని వారు కోరారు.

కుష్టు వ్యాధి పట్ల అవగాహన అవసరం

జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్ తెలిపారు. కుష్టువ్యాధి నివారణ మాస ఉత్సవాలలో భాగంగా బుధవారం ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాదని, మందులతో నయం చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు రిటైర్డ్ డిపిఒ యువరాజు, శంకరమ్మ దంపతులు ఉచితంగా దుప్పట్లు చీరలు పంపిణీ చేశారు. స్థానిక డిపిఒ కానికరాజ్ అందరికీ భోజనం అందించారు. వైద్యాధికారులు గిరిధర్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం రెడ్డి, డిపిఎంఒ జాన్, సూపర్వైజర్లు గంగాదేవి, శ్రీనివాసులు రెడ్డి, వైద్యసిబ్బంది జగదీష్, లోకేశ్వరి, పి.భారతి, యమునా పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ విజేతలుగా
పిఈఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏపీ స్టేట్ అండర్ -16 యూత్ బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్‌లో భాగంగా ఈనెల 8 నుండి 11వ తేదీ వరకు ఈస్ట్ గోదావరి పిఠాపురంలో జరిగిన పోటీల్లో చిత్తూరు పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు బాలుర విభాగంలో జశ్వంత్, సాయి ప్రణీశ్వర్, కృతిన్, పృధ్వి మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి.కృష్ణ బాబు గెలుపొందిన విద్యార్థులకు, తోడ్పాటునందించిన తల్లిదండ్రులకు, పీఈటీలకు అభినందనలు తెలియజేశారు.

మామిడి కవర్లకు నమోదు చేసుకోండి

జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- యాదమరి: జిల్లాలోని మామిడి తోపులు కలిగిన రైతులు మామిడి కవర్ల కోసం ఉద్యానశాఖ ద్వారా రైతు వాటా నగదు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల రైతు భరోసా కేంద్రాల్లో ఆర్ఎస్కే ఇన్చార్జిలను సంప్రదించి మామిడి కవర్లు కావలసిన రైతులు రైతు వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక కవరు ధర ఒక రూపాయి చొప్పున ప్రభుత్వం రైతులకు అందిస్తుందని ఇది కాకుండా అన్లోడింగ్ ఛార్జీలు అదనంగా చెల్లించాలని తెలిపారు. కావలసిన రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ముగిసిన రైతుల అవగాహన సదస్సు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసింది. మండల వ్యవసాయ అధికారి పయాజ్ బాష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న పథకాలను అమలులోనికి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఈ సదస్సు ద్వారా రైతులకు వివరించే ప్రయత్నం చేశారు. ప్రతి ఒకరైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న విశిష్ట గుర్తింపు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు మునిరత్నం, నాయకులు తిమ్మప్ప, బీరప్ప, వెంకటాచలం, బాలు, రామప్ప, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మైనారిటీ సబ్సిడీ రుణాలకు గడువు పెంపు

ప్రజాశక్తి - కార్వేటినగరం: మైనారిటీ కార్పొరేషన్ల కింద అందించే సబ్సిడీ రుణాలను ఈ నెల 15వ తేదీ వరకు పెంచడం జరిగిందని ఎంపిడీవో చంద్రమౌళి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనారిటీల (ముస్లిం, సిక్కు బుద్ధిస్టు, జైన్) కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన వారు తమ కార్పొరేషన్ల సంబంధించిన వారు ఆన్లైన్ ద్వారా సంబంధిత ఆధారాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రుణం కోసం దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులకు సంవత్సర ఆదాయం రూ. లక్ష 50 వేలుకు మించకూడదన్నారు. వయస్సు 21 నుంచి 55 లోపు ఉండాలని పేర్కొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు భారీ స్పందన

ప్రజాశక్తి- సోమల: బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ కేటగిరీలలో మండలానికి 62 యూనిట్లు మంజూరయ్యాయని వీటి కోసం ఇప్పటివరకు అన్ని కేటగిరీలలో ఆన్లైన్లోనూ, సచివాలయాల ద్వారాను, వ్యక్తిగతంగాను 252 దరఖాస్తులు వచ్చినట్లుగా ఎంపీడీవో నారాయణ తెలిపారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకోవాలనుకున్న వారు ఈనెల 15వ తేదీలోపు ఆన్లైన్ ద్వారా లేదా సచివాలయాల ద్వారా బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఇదేనా.. చెత్త నుంచి సంపద కేంద్రం



ప్రజాశక్తి- విజయపురం (నగరి): చెత్త నుంచి సంపద సృష్టించి.. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగపడుతుందని ఆశయంతో గత ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. అధికారుల అలసత్వంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడం వల్ల అవి మూలకు చేరి నిరుపయోగంగా మారాయి. మండలంలోని 21 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చెత్త సంపద కేంద్రాలు నిర్మించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడా పూర్తిస్థాయిలో చెత్త సంపద కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టలేదని స్థానికుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. మండలంలో 13 సచివాలయాలు ఉన్నాయి. అందులో కొన్ని సచివాలయాల పరిధిలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మిగిలాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేసి వీటి నిర్వహణకు షెడ్ మిత్రులు, క్లాప్ మిత్రులు ప్రభుత్వం నియమించి వీరికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. వీరు గ్రామంలోని చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలిస్తారు. ఆదాయం పోతున్నారు. అలాగే మండలంలోని చాలా గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించకపోవడంతో సేకరించిన చెత్త వేరే చోటకు తరలించడంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయం పోతుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆశయానికి గండి పడుతోందనడానికి ఇది నిదర్శనమని చెప్పవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావడంతోపాటు నిలిచి పోయిన కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి- కుప్పం రూరల్: అభివృద్ధికి ఆనవాలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ తెలిపారు. కుప్పం పట్టణం 14వ వార్డు పరిధిలో అభివృద్ధి పనులకు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సిఎం ఆదేశాలతో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబుల సహకారంతో 14వ వార్డు పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమైనట్టు తెలిపారు. బూత్ ఇంచార్జ్ ఉదయ్ ఒడియార్, మాజీ ఎంపిటీసీ కృష్ణన్, వాసు, కృష్ణన్ పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుప్పం పట్టణ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వరుణ్ తేజ్ పిలుపునిచ్చారు. బుధవారం కుప్పం న్యాయస్థానంలో ఆయన జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవడం వల్ల కక్షిదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. మార్చి 8వ తేదీన జరుగబోవు లోక్ అదాలత్ కార్యక్రమం జయప్రదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టిడిపి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం 13వ తేదీ గురువారం రాళ్ల గంగమాంబ దేవస్థానంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు టిఎం. బాబు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు తప్పక హాజరు కావాలని కోరారు.

తాగునీటి కోసం బోరు డ్రిల్లింగ్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని టికెఎం పురం పంచాయతీ టికెఎం పురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడానికి పంచాయతీ నిధులతో బోర్ డ్రిల్లింగ్‌ను ప్రారంభించినట్లు సర్పంచ్ లక్ష్మీ తెలిపారు. బుధవారం సర్పంచ్ లక్ష్మీ బోరు వేయడానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

వైసిపి మండల అధ్యక్షులుగా ప్రకాష్

ప్రజాశక్తి- గుడిపాల: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులుగా రాసనపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ తమ మీద నమ్మకం ఉంచి బాధ్యతలు ఇచ్చినందుకు జిల్లా అధ్యక్షులకు, విజయానందరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శ నిర్వాహక కార్యదర్శి రజనీకాంత్, మధు రెడ్డి, మధు రాయల్ అభినందనలు తెలిపారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు



ప్రజాశక్తి - కార్వేటినగరం: దరఖాస్తులదారుల నుంచి అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్నెట్, మీసేవా కేంద్రాల యజమానులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం ఆన్లైన్ దరఖాస్తుల కోసం వచ్చే లబ్ధిదారుల నుంచి మీ సేవా కేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, అలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. సచివాలయాల్లో రూ.50 అయితే మీ సేవా కేంద్రాల్లో రూ.వంద నుంచి రెండు వందల వరకు పీజులు తీసుకున్నట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారన్నారు. ఇది మళ్లీ పునరావృత్తం అయితే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ల రుణాలను అర్హులందరికీ లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడువును ప్రభుత్వం ఈనెల 15వ తేదీ వరకూ పెంచడం జరిగిందనీ అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కొరకు దరఖాస్తులు ఈనెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు.

'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025- 2026 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశంకు బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానించ బడుతున్నాయని ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని చిత్తూరు జిల్లా సమన్వయ అధికారి గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు, దరఖాస్తులు తేదీ ఈనెల 7 నుంచి మార్చి 6వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర సమాచారం కొరకు వెబ్సైట్లను సందర్శించాలని, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, చిత్తూరు జిల్లా సమన్వయ అధికారిని గాని ఏదైనా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు నుంచి 4.30 గంటలకు జరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్స్ ఫోన్ నంబర్లు బాలికలు చిత్తూరు: 97045 50109, జీడినెల్లూరు: 99892 11885, పలమనేరు: 94933 71732, కుప్పం: 99598 88586. బాలురు రామకుప్పం : 97045 50107, పూతలపట్టు: 70327 03758, విజలాపురం – 96667 27126 సంప్రదించాలని తెలిపారు.

కోడిగుడ్లు, మాంసంపై అపోహాలు వద్దు

జేడీ పశుసంవర్ధక శాఖ

ప్రజాశక్తి- యాదమరి

కోడిగుడ్లు, మాంసంపై అపోహాలు వద్దని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాధిని కోళ్ళలో నిర్ధారించడం దృష్ట్యా (గోదావరి జిల్లా) జిల్లాలోని పశు సంవర్ధక శాఖ ముందస్తు చర్యగా జిల్లాలోని స్థానిక పశువుల వైద్యాధికారులచే తనిఖీ చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని, జిల్లాలో కోళ్ళలో ఎటువంటి అసాధారణ మరణాలు నమోదు కాలేదని నిర్ధారించారు. ముందస్తు వ్యాధి నిరోధక చర్యలలో భాగంగా జిల్లాలోని కోళ్ళ రైతులను తగు నివారణ చర్యలను చేపట్టి వ్యాధిని వ్యాపించకుండా జాగ్రత్త వహించాల్సిందిగా సూచించారు. ఇందులో భాగంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కోళ్ళ రవాణా విషయంగా స్థానిక చెక్ పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని, అపోహలకు పోకుండా కోడి మాంసం, గుడ్లు వినియోగించేవారు ఎప్పటిలాగే వినియోగించుకోవచ్చు అని తెలిపారు. కోడి గుడ్లు, మాంసంను బాగా ఉడికించి వినియోగించడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు.

పేయి దూడల ప్రదర్శన

పాడి పరిశ్రమ అభివృద్ధికి యాజమాన్య పద్ధతులు పాటించాలి

చిత్తూరు జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ



ప్రజాశక్తి- యాదమరి: యజమాన్యం పద్ధతులు పాటిస్తేనే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని చిత్తూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని లక్ష్మయ్య కండ్రిగలో పిటిపి ప్రాజెక్టు ద్వారా ప్రయోగాత్మకంగా పెంచుతున్న పేయి దూడల పెంపకం, సంకరజాతి పేయి దూడల ప్రదర్శన కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో పిటిపి ప్రాజెక్ట్‌లో పేయి దూడలను ఎలా పెంచాలి, చేపట్టవలసిన మెలుకువలు, రైతులు పాడి పరిశ్రమలో లాభాదాయకంగా ఎలా పశువులు పెంచాలి, శంకర జా తి ఆవుల ద్వారా పాల దిగుబడిని ఎలా పొందాలి వంటి వాటిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. చిత్తూరు జిల్లాలోని పిటిపి ప్రాజెక్టు ద్వారా లక్ష్మయ్యకండ్రి గ్రామంలో మొట్టమొదటగా చేపట్టడం జరిగిందని, పిటిపి ప్రాజెక్ట్ డిడి డాక్టర్ వాసు తెలిపారు. అలాగే గ్రామంలో నాణ్యమైన పేదల పెంపకం చేపట్టిన రైతులను అభినందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడి ఆసఫ్, డిడి హరీఫ్, పిటిపి డాక్టర్ ఆదిత్య, మండల పశు వైద్యాధికారి సంధ్య, రైతులు సుబ్రమణ్యం, మునస్వామి నాయుడు పాల్గొన్నారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌పై అవగాహన



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పాతపేటలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తడి చెత్త - పొడిచెత్తను వేరు చేయడం, సులభంగా రీసైక్లింగ్ చేయడం గురించి మునిసిపల్ కమీషనరు ఎన్వి రమణారెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయడం, పొడి వ్యర్థాలను సులభంగా రీసైకిల్ చేయడం, తడి వ్యర్థాలను కంపోస్ట్ ఉపయోగించడం వలన భూమిలో పడే వ్యర్థాల పరిమాణం గణనీయంగా తగ్గుతుందని, గాలి. నీటి కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. వ్యర్థాల ద్వారా తయారు చేసిన కంపోస్ట్ ఎరువులను పెరటి మొక్కలకు వాడుకోవచ్చు అని, అదనంగా మిగిలిన ఎరువులతో అదనపు ఆదాయాన్ని పెంచుకోవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజరు, సిటీ మిషన్ మేనేజర్, మెప్మా సీఓలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి

అక్రమ కేసులకు స్వస్థి పలకండి

నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్



ప్రజాశక్తి- కార్వేటినగరం: హత్యలు, దొంగతనాలు, మాదక ద్రవ్యాల అమ్మకాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తనతో మెలగాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్త కలిగి ఉన్న వారికి కేసు మాఫీ చేసే అవకాశం ఉంటుందన్నారు. మహిళలపై అగాయిత్యాలు, హత్యలు, దొంగతనాలు, అక్రమార్జన కోసం మాధక ద్రవ్యాలు అమ్మకాలు వంటి వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే పలు రకాల కేసుల్లో రౌడీ షీటర్గా ఉంటున్నవారు వయోపరిమితి పెరిగి, అనారోగ్యంతో బాధపడుతున్న వారు డాక్టర్ సర్టిఫికేట్‌తో పాటు వినతిపత్రాన్ని స్థానిక ఎస్ఐలు, సీఐకి అందించినట్లయితే వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి కేసు నుంచి తొలగించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిందితులుగా ఉన్న వారు సద్వినియోగం చేసుకుని, గ్రామాల్లో జరిగే గంజాయి, సారా, మద్యం వంటి అమ్మకాల వివరాలను పోలీసుల దృష్టికి తీసుకొచ్చి సహకరించి తమ నిజాయితీని చాటుకోవాలని సూచించారు. నిందితులుగా ఉన్న వారు తమ జీవన శైలిలో మార్పు తెచ్చుకుంటే రౌడీపీటర్‌ను నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు మీపై ప్రత్యేక నిఘా ఉంచుతారని గుర్తు చేశారు. సిఐ హనుమంతప్ప, ఎస్ఐలు రాజ్ కుమార్ (కార్వేటినగరం), సుమన్ (శ్రీరంగరాజపురం), వెంకట సుబ్బయ్య (వెదురుకుప్పం) పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు పట్టివేత



ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండల పరిధిలోని అశోక్‌నగర్ కాలనీ వద్ద బుధవారం తెల్లవారు జామున పీలేరు డిఎఫ్ఓ సంచారదళ నిఘా విభాగం పోలీసులు ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్న కారును సోదా చేసి తొమ్మిది ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పీలేరు సంచారదల నిఘా విభాగం డిఎఫ్ఓ ఎం.గురు ప్రభాకర్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శేషాచలం రిజర్వ్ అటవీ ప్రాంతం నుండీ తమిళనాడు రాష్ట్రానికి ఎర్రచందనం రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో స్థానిక పోలీసులు ఎంజీఆర్ కళాశాల వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా కారు చెక్‌పోస్టు వద్ద ఆగకుండా స్పీడ్‌గా వెళ్లడంతో సిబ్బంది కారును వెంబడించి పులిచెర్ల మండల పరిధిలోని అశోక్‌నగర్ కాలనీ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. కారులో ఉన్న ఆరుగురు వ్యక్తులలో ఐదుగురు పారిపోగా ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు తెలిపారు. స్మగ్లర్ తమిళనాడు రాష్ట్రానికి చెందిన కొరత్తూరు గ్రామానికి చెందిన వెంగ దేసియన్ పప్పయన్ అని తెలిపారు. కారులో 9 ఎర్రచందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ రూ.15 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎఫ్ఆర్ఓ ఎస్.చంద్రశేఖర్, ఎఫ్‌బిఓ ప్రతాప్, ఎస్.కుప్పస్వామి, ప్రొటెక్షన్ వాచర్స్ పాల్గొన్నారు.

వరుస ఆవుల చోరీ

- బెంబేలెత్తుతున్న పశు యజమానులు - పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలంలో ఇటీవల వారం రోజులుగా వరుస ఆవుల చోరీలు జరుగుతూ ఉండడంతో పశు యజమానులు ఆందోళన చెందుతున్నారు. కందూరు రెండు, పేగలవారిపల్లి రెండు, ముండ్రెవారిపల్లి ఒకటి, అడుసుపల్లి ఒకటి మండలంలో మిగిలిన పలు ప్రాంతాలలో ఒక్కొక్కటి చొప్పున దాదాపు 9 నుండి 10 ఆవులు ఇటీవల కాలంలో చోరీకి గురైనట్లు సమాచారం. పశు యజమానులు ఆవులను కొందరు ఇంటి వద్ద మరికొందరు వ్యవసాయ పొలాల వద్ద కట్టి ఉంచగా తాడు తెంపుకొని వెళ్లి ఉండవచ్చునని పలు ప్రాంతాలలో గాలింపులు చేపట్టి చివరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆవుల చోరీపై ఎస్సై శివ శంకర్‌ను వివరణ కోరగా తమకు ఆవుల చోరీల సమాచారం అందిందని పలువురు పశు యజమానులు తమ ఆవులు చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేస్తున్నారని మండలంలో పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలు పరిశీలించి చోరీకి గురైన ఆవులను దొంగలను త్వరలోనే పట్టుకుని పసు యజమానులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తృటిలో పెనుప్రమాదం తప్పినట్టు లారీ డ్రైవర్ తెలిపారు. బుధవారం బెంగళూరు నుండి చెన్నై వెళ్తున్న లారీ మొగిలి ఘాటుకు వచ్చేప్పటికీ అదుపుతప్పి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో బోల్తాపడింది. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

లారీలో మంటలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మహాసముద్ర గ్రామం టోల్ గేట్ వద్ద లారీలు మంటలు వ్యాపించిన సంఘటన సోమవారం రాత్రి చెన్నై- బెంగళూరు జాతీయ రహదారులో చోటు చేసుకుంది. అనంతపురం జిల్లా పెనుగొండ నుండి కియో కార్ల విడిభాగాలను చెన్నైకి తరలిస్తుండగా లారీ టైర్ అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి వాహనాన్ని ఆపి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.

ఐచర్ బోల్తా..

ప్రజాశక్తి- వెదురు కుప్పం: మండలంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న భారతి గ్యాస్ గోదాము మలుపు వద్ద బుధవారం ఉదయం అదుపుతప్పి ఐచర్ వాహనం బోల్తా పడింది. ఈ వాహనం ధాన్యం బస్తాలతో తిరుపతి వైపు నుంచి మండలంలోని పెరుమాళ్ళపల్లికి వెళుత్తుండా అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ ఈ మలుపును గుర్తించకుండా అతివేగంగా రావడమే కారణమని స్థానికులు తెలిపారు.

టిడిపి కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- ఐరాల: మండలంలోని తిరుమలయ్యాగారిపల్లె గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త జయరామయ్య మృతదేహానికి పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షులు గిరిధర్ బాబు, చిత్తూరు పార్లమెంటు రైతు సంఘం ఉపాధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు ఉన్నారు.

